క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆలిండియా రేడియో స్టేషన్, రాఘవేంద్రకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్ఆర్ ఇంటిపై ఐటీ అధికారులు దాడులకు నిరసనగా ఆ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. విషయం తెలియడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి గురువారం ఉదయమే చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఆడుతున్న నాటకమమని మండిపడ్డారు. ఎన్ని దాడులు చేసిన తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.లక్ష పట్టివేత

మంచాల: ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.లక్ష పట్టుబడిన ఘటన మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. లోయపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నల్గొండ జిల్లా చండూర్ మండల కేంద్రానికి చెందిన ముమ్మడి శ్రీనివాస్, కిరాణ వ్యాపారి, అతని నుంచి లక్ష రూపాయాలు పట్టుకున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసిన్నట్లు సీఐ తెలిపారు.

బోరుమోటార్ల కేబుల్ వైర్లు చోరీ

యాచారం: మండలంలోని ధర్మన్నగూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో బుధవారం రాత్రి దుండగులు వ్యవసాయ బావుల వద్ద సర్వీస్ కేబుల్ వైర్లను చోరీ చేశారు. రెండు గ్రామాలకు చెందిన 24 మంది రైతులకు చెందిన 32 కనెక్షన్ల కేబుల్ వైర్లను కత్తిరించి తీసుకెళ్లారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు గురువారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లగా.. వైర్లు కత్తిరించి ఉన్నాయి. ఈ విషయమై ఆయా గ్రామాలకు చెందిన రైతులు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జైపాల్‌యాదవ్‌ను గెలిపించుకుందాం

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను మరోసారి గెలిపించాలని, గురువారం మండలంలోని గానుగుమార్లతండాలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు ,కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడపగడపకూ తిరుగుతూ.. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలోని అంశాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు లక్పతినాయక్, సేవ్యా, లాయక్‌అలీ, పాండు, శ్రీను, భీమన్, మహేశ్, చందర్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాడ్గుల: ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందా మని మాడ్గుల మండల అధ్యక్షుడు జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గిరికొత్తపల్లి, నల్లావారిపల్లి, అవురుపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ పద్మ శీను, ఎంపీటీసీ సరిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని గెలిపించండి

ఆమనగల్లు: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావ్ అన్నారు. మండలంలోని ఆకుతోటపల్లిలో గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంగమ్మ, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, ఎంపీటీసీ కుమార్, స్థానిక నాయకుడు వెంకటయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఓట్లు అడుగుతున్నాం



సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

- ప్రతిపక్షాలకు ఓట్లు అడిగే హక్కు లేదు
- మంత్రి సబితారెడ్డిని గెలిపించండి
- బీఆర్ఎస్ నాయకుల పిలుపు
- ప్రచారంలో బిజీబిజీ

కందుకూరు: మహేశ్వరంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని జబ్బార్‌గూడ, మాదాపూర్, బేగరికంచె గ్రామాల్లో వీరిద్దరు వేర్వేరుగా పార్టీ నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డిని మరోసారి గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించి కార్యక్రమంలో సర్పంచ్‌లు యాచారం సుగుణమ్మ, మంద సాయిలు, సరళమ్మ, ఎంపీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, రాములు, సీనియర్ నాయకుడు దశరథ, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, బాబయ్య, దేవీలాల్, పారిజాతం, కృష్ణారెడ్డి, దర్శన్‌రెడ్డి, రూప్‌చందర్, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పచారం చేస్తున్న మాజీ ఎంపీపీ తదితరులు

సాయిరెడ్డిగూడలో..

సాయిరెడ్డిగూడలో బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీ ఇందిర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జంగయ్య, రాములు, గోవర్ధన్‌నాయక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ప్రచారం

మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ ఎంపీపీ వి.శోభాఈశ్వర్‌గౌడ్‌తో పాటు మహిళా కార్యకర్తలు గురువారం వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు, కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

ఇంటింటి ప్రచారం

హుడాకాంప్లెక్స్: అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ భరోసా అని సరూర్‌నగర్ డివిజన్ నాయకుడు ఇంటూరి అంకిరెడ్డి, బోయిని మహేందర్‌యాదవ్‌లు తెలిపారు. గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ పంజాల అనిల్‌కుమార్‌కాలనీ, అంబేద్కర్‌నగర్ కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి చేసిన అభివృద్ధిని చూసే ఓటు అడుగుతున్నామని, ప్రతిపక్షాలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. రాఘవేంద్ర గుప్తా, సలీం, సుధామా, జహంగీర్, యాదమ్మ పాల్గొన్నారు.

సబితారెడ్డిని విమర్శిస్తే సహించం

- మంత్రిపై ఆరోపణలు తగవు
- బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ నాయకుల ఇళ్లపై జరిగిన ఐటీ దాడులతో ఎలాంటి సంబంధం లేని మంత్రి సబితారెడ్డిపై ఆ పార్టీ నాయకులు ఆరోపణలు చేయడాన్ని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి ఖండించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఐటీ, ఈడీ సంస్థలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తాయని, ఈ విషయం తెలియని కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం సిగ్గు చేటన్నారు. తమ కార్పొరేటర్ ఇంటిపై కూడా ఐటీ అధికారులు దాడులు చేశారని తెలిపారు. జాతీయ పార్టీల మధ్య ఉన్న గొడవలు బీఆర్ఎస్‌కు పూయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏదైనా ఉంటే ఆ పార్టీలు చూసుకోవాలని, అనవసరంగా సబితారెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ మంద సాయిలు, ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, హన్మంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, విఘ్నేశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాములు, నవీన్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సబితారెడ్డికి సంబంధం లేదు

బడంగ్‌పేట్: మేయర్ పారిజాత ఇంటిపై ఐటీ దాడులకు మంత్రి సబితారెడ్డికి ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ నాయకులు కొట్టిపారేశారు. మంత్రిని బదునాం చేయడం మేయర్‌కు తగదని హెచ్చరించారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో సబితారెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆనంద్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు సంతోశ్, ఉపాధ్యక్షుడు బాలేష్‌చారి, ప్రవీణ్ తదితరులున్నారు.

ఓటమి భయంతోనే ఐటీ దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓడిపోతుందనే భయంతోనే కాంగ్రెస్ అభ్యర్థి కార్యాలయాలపై ఐటీ దాడులు చేయిస్తున్నారని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జరిగిన ఐటీ అధికారుల సోదాలను ఖండించారు. ఆర్‌కేపురంలో ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే కాంగ్రెస్ అభ్యర్థితో పాటు మరికొందరు కాంగ్రెస్ నేతల ఇంటిపై మంత్రి సబితారెడ్డి ఐటీ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారానికి వెళ్లనీయకుండా చేసి గెలుపును అడ్డుకోవాలని చూస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పన్న గణేశ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, కల్యాణ్ యాదవ్, పగడాల శ్రీశైలం, విజయ్, కృష్ణ, నబీ, విప్లవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘గ్యారంటీ’లో ముస్లింల ప్రస్తావనేది?



పార్టీలో చేరిన నాయకులతో కార్తీక్‌రెడ్డి

- బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్ రెడ్డి

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓటు బ్యాంక్ రాజకీయాలకు వాడుకుంటోందని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఖాన్ అనుచరులతో కలిసి బుధవారం రాత్రి జల్‌పల్లి మున్సిపాలిటీలోని షాహిన్‌నగర్‌లో కార్తీక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలలో ముస్లింల ప్రస్తావనే లేదన్నారు. ముస్లింల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని ప్రకటించారు. ఈ ప్రాంతంపై కనీస అవగాహన లేని నాయకుడిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ హరితా ధన్‌రాజ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

మధుయాష్కీ ప్రత్యేక పూజలు

వనస్థలిపురం: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీ హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఉన్న మహిళతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేయాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్ట్

- రూ.1.89 లక్షల నగదు..
- 240 కిలోల రాగి తీగ, బైక్ స్వాధీనం

కందుకూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగను దొంగిలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.1.89 లక్షల నగదుతో పాటు విలువైన రాగి తీగ, బైక్‌ను స్వాధీనం మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్ జిల్లా, శామ్‌దిగా గ్రామానికి చెందిన లియాకత్ షేక్(36), హర్యానా రాష్ట్రం నుహు జిల్లా, లోహింగాకలాన్ గ్రామానికి చెందిన మహ్మద్ సువాలే(26) బావ బావమరుదులు. వీరిద్దరూ రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం, కుర్మల్‌గూడ ఇంద్రనగర్ కాలనీలో నివసిస్తున్నారు. జేసీబీ డ్రైవర్లుగా పనిచేస్తున్నట్లు స్థానికులను నమ్మించి.. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాయిల్స్, రాగి తీగలను ఇతర పరికరాలను అపహరించేవారు. ఇలా కందుకూరు, మహేశ్వరం, పహాడీషరీఫ్, యాచారం, ఆదిబట్ల, శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, మోమిన్‌పేట, పెద్దేముల్, తుర్కపల్లి, రాజాపేట, కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ పొలాల్లో పది నెలలుగా రాగి తీగను తస్కరిస్తున్నారు. అయితే బుధవారం రాత్రి జైత్వారం గ్రామం పరిధిలోని ఫీడర్ ట్రిప్ కావడంతో ఏఈ, లైన్‌మెన్‌లు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా.. 47 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగను దొంగిలించినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. వీరిపై పలు పోలీస్‌స్టేషన్‌లో 34 కేసులు నమోదైనట్లు వివరించారు.



నిందితులతో ఏసీపీ శ్రీనివాస్, సిబ్బంది

ఇద్దరూ పాత నేరస్తులే

లియాకత్ షేక్ 2022 సెప్టెంబర్‌లో మెదక్ జిల్లా భానూరు పీఎస్ పరిధిలో ఓ ఏటీఎంను ధ్వంసం చేసి రూ.15 లక్షలు చోరీ చేసిన కేసులో బెయిల్ విడులయ్యాడు. జైలులో నేరస్తుల సలహాతో బయటికి వచ్చి మొదట ఆటో ట్రాలీతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగను ఒక్కడే దొంగిలించేవాడు. ఆ తర్వాత మహ్మద్ సువాలేను కలుపుకున్నాడు. ఇద్దరు కలిసి కందుకూరు చౌరస్తాలో దొంగిలించిన బైక్‌కు నంబర్ మార్చి, ఆ బైక్‌పై రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్నారని వివరించారు. మహ్మద్ సువాలే కూడా జనగాం ప్రాంతంలో జేసీబీ దొంగతనం చేసిన కేసులో నిందితుడు. కాగా వీరి వద్ద నుంచి రూ.1.89 లక్షల నగదుతో పాటు 240 కిలోల రాగి తీగను, గ్యాస్ సిలిండర్, కట్టర్, చోరీకి ఉపయోగించే పనిముట్లను స్వాధీనం చేసుకుని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడానికి సహకరించిన విద్యుత్ అధికారులు, సిబ్బంది, పులిమామిడి రైతులు ఏసీపీ అభినందించారు. ఆయన వెంట సీఐలు విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, మధు, ఎస్ఐ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీ దాడులు.. కక్షసాధింపే

- బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు
- పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు జంగారెడ్డి

కందుకూరు: రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఐటీ అధికారులు దాడులు జరుగుతున్నాయని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు జంగారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై తమ నాయకుల ఇళ్లపై ఐటీ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. గురువారం మండల పరిధిలోని గఫూర్‌నగర్‌కు చెందిన పలువురు జంగారెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుందని, ముఖ్యంగా మహేశ్వరంలో కేఎల్ఆర్ గెలుపు ఖాయమని తెలిసే ఐటీ సోదాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, నాయకులు సులేమాన్, శ్రీకాంత్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఐటీ దాడులు చేయిస్తున్నారని పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆరోపించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డి ఓడిపోతుందనే భయంతో.. బీజేపీతో చేతులు కలిపి కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్, మేయర్ పారిజాత ఇళ్లపై ఐటీ దాడులు చేయించారని ఆరోపించారు. సబితారెడ్డికి ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవాచేశారు. సీబీఐ, ఐటీ, ఈడీ సంస్థలు బీజేపీ పార్టీకి బీ టీమ్‌లుగా పని చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకుడు ఆవుల యాదయ్య, మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కమలమ్మ, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు రమేశ్, ఆనంద్, కొమురయ్య, భాస్కర్, చంద్రమోహన్, శ్రీకాంత్ పలువురు పాల్గొన్నారు.

కేఎల్ఆర్‌ను గెలిపించండి

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్)ను భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అభ్యర్థించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. గురువారం రాత్రి మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ వద్ద ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ హామీలను అమలు చేస్తామని తెలిపారు. సభలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మండల, కార్పొరేషన్, డివిజన్ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సబితారెడ్డిని ప్రశ్నించిన చల్లా

పహాడీషరీఫ్: రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానంటున్న మంత్రి సబితా రెడ్డికి జల్‌పల్లి మున్సిపాలిటీ సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఏళ్లు గడుస్తున్నా ఉస్మాన్‌నగర్ ముంపు సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఆరు గ్యారంటీ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ న్యాయం చేస్తుందన్నారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, అహ్మద్, యూసుఫ్ పాల్గొన్నారు.



సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

లిక్కర్ వద్దు.. వాకింగ్ ముద్దు

- రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- మహేశ్వరం అభివృద్ధికి కృషి
- అందెల శ్రీరాములు యాదవ్

హుడాకాంప్లెక్స్: ‘లిక్కర్ వద్దు.. వాకింగ్ ముద్దు’ అని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. సరూర్‌నగర్ వీఎంహోంలో వాకర్స్‌తో కలిసి గురువారం ఉదయం ఆయన మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహేశ్వరం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములు కాపాడతానని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని ప్రకటించారు. తనను ఆదరించాలని, ఎన్నికలలో ఓడినా, అధికారం కోసం పార్టీ మారే సంస్కృతి బీజేపీ నేతలకు లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆరుట్ల సురేశ్, ప్రవీణ్, డివిజన్ అధ్యక్షుడు సిద్దు ముదిరాజ్, శివరాజ్, జంగయ్య, పరమేశ్, కార్తీక్, వీఎంహోం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న శ్రీరాములు యాదవ్

కార్యకర్తలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోం

పహాడీషరీఫ్: బీజేపీ కార్యకర్తలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ హెచ్చరించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో బుధవారం రాత్రి ర్యాలీ అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీలో సమస్యలపై తాము ప్రశ్నించాకే మంత్రి స్పందించారన్నారు. రాష్ట్రంలో అవినీతి పాలనకు చరమగీతం పాడాలంటే బీజేపీ సర్కార్ రావాల్సిన అవసరం ఉందన్నారు. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ పగటి కలలు కంటుందని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కపిల్ గౌడ్, కౌన్సిలర్లు ప్రశాంతి, బుడుమాల యాదగిరి, నాయకులు శాంతకుమార్, గొరిగె మల్లేశ్, దిలీప్ గౌడ్, గౌర మురళీ, సంతోశ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.